ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విజయనగరం

జిల్లా వార్తలు

శుక్రవారం 18 అక్టోబరు 2024



ఆందోళన వద్దు.. సహకారం అందిస్తాం: మంత్రి

గుర్ల డయేరియా బాధితులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. డయేరియా మృతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. అసలు డయేరియా దేనికారణంగా ప్రబలిందో అర్థం కావడంలేదని అధి కారులు తెలిపారు. రామతీర్థం సాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని, కెల్ల జంక్షన్ వద్ద పంపుసెట్ల వాటర్‌ను పరీక్షించినట్లు చెప్పారు. పూర్తిగా వివరాలు సేకరించి ప్రజలు కోలుకునేలా చూడాలని మంత్రి ఆదేశించారు. బాధితులు భయపడాల్సిన పనిలేదని, భయం ఎక్కువ ఉంటే బీపీ, షుగర్ పెరుగుతా యని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

గుర్లను వణికిస్తున్న డయేరియా

- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- ఇప్పటికే ఐదుగురి మృతి
- తాజాగా వృద్ధురాలు
- బాధితులను పరామర్శించిన మంత్రి



పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తాం

- రాష్ట్ర ప్రజా ఆరోగ్యశాఖ సంచాలకులు పద్మావతి

రెండు రోజుల పాటు గ్రామాల్లో ఉండి పరిస్థితిని అదుపులోకి తీసుకు వస్తామని రాష్ట్ర ప్రజా ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి అన్నారు. గురువారం ఆమె గుర్ల గ్రామంలో పర్యటించారు. తాగునీటి సరఫరా విధానం, పైపులైన్ల లీకేజీ, చెత్తాచెదారం ఉండే చోట పైపులైన్లు ఉండడం, తదితర వాటిని ఆమె పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. కలుషిత పదార్థాలు, నిల్వ మాంసం, ఆహారం తింటే ఇటువంటి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. కాగా, గత రెండు రోజుల నుంచి గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.



బోడసింగి రామలమ్మ(ఫైల్)

గుర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర మైన గుర్ల గ్రామాన్ని గతవారం రోజుల నుంచి డయేరియా వణికిస్తోంది. ఈ వ్యాధితో ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడగా, తాజాగా గురువారం బోడ సింగి రాములమ్మ(70)అనే వృద్ధురాలు మృతి చెందింది. పదుల సంఖ్యలో బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తొలుత గ్రామానికి చెందిన చింతపల్లి అప్పారావులో ఈ నెల 12న డయేరియా లక్షణాలు కనిపించాయి. ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకున్నారు. రోగం తగ్గిందని ఇంటికి వెళ్లాడు. ఆ మరుసటి రోజు ఉదయాన్నే మృతిచెందాడు. అలాగే కలిసేటి సీతమ్మ ఈ నెల 14న డయేరియాతో బాధపడుతూ పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అదేరోజు విజయనగరం ఆస్పత్రికి వైద్యులు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. అలాగే, సారిక పెంటయ్య ఈ నెల 14న రాత్రి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ మరుసటి రోజు ఉదయం మృతిచెందాడు. అదేవిధంగా పాంద్రంగి రాము, గుమ్మిడి పైడమ్మ కూడా డయేరియాతో విజయనగం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 15న మృతిచెందారు. తాజాగా, గురువారం బోడసింగి రాములమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. రెండు రోజుల కిందట రాములమ్మ డయేరియా బారినపడడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆరోగ్యం బాగుందని ఇంటికి వెళ్లింది. ఇంటికి వెళ్లిన తరువాత ఆరోగ్యం విషమించి గురువారం మృతి చెందింది. కాగా, వీరంతా వారం రోజుల వ్యవధిలోనే మృత్యువాత పడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.



విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

కోటగండ్రేడులో ఒకరు..

గుర్ల మండలం కోటగండ్రేడు గ్రామానికి చెందిన మరడాన అప్పలనర్సయ్యమ్మ (57)డయేరియాతో బుధవారం రాత్రి మృతి చెందింది. రెండు రోజుల కిందట ఈమె గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందింది. మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. అక్కడ ఆరోగ్యం విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

పెళ్లికొడుకుకు విరేచనాలు

గుర్ల గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ పెళ్లి బుధవారం రాత్రి విశాఖపట్నం జిల్లా సింహాచలంలో జరిగింది. తాళికట్టే సమయానికి ఆయనకు విరేచనాలు రావడంతో ఇబ్బందులు పడ్డాడు. పెళ్లయిన మరుక్షణమే విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పెళ్లికొడుకు తమ్ముడు కూడా విరేచనాలతో బాధపడుతూ విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



ఆనందపురం వద్ద చంపావతి నదిలో వేసిన చెత్త



డయేరియా బాధితులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గుర్ల గ్రామంలో పర్యటిస్తున్న ఆరోగ్యశాఖ సంచాలకులు పద్మావతి

మాట మార్చారు..

గుర్ల గ్రామానికి చెందిన బోడ సింగి రాములమ్మ అనే వృద్ధురాలు డయేరియాతో మృతి చెందిందని తొలుత కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే, తరువాత ఏమైందో గానీ మాట మార్చారు. రాములమ్మకు గత 15 రోజులుగా ఆరోగ్యం బాగోలేదని, ఆహారం తీసుకోకపోవడంతో బాగా నీరసించిపోయిందని, అందుకే మృతి చెందిందని చెప్పారు. ఈ మేరకు ఒక వీడియో విడుదల చేశారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు



గొల్లపల్లి, పక్కి గ్రామాల్లో కొలువుదీరిన నందెన్న

బొబ్బిలి/బొబ్బిలిరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం నందెన్న ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బొబ్బిలి పట్టణంతో పాటు గొల్లపల్లి, మల్లమ్మపేట, పాతబొబ్బిలి, గొల్లవీధి, పక్కి తదితర గ్రామాల్లో పార్వతీపరమేశ్వరులతో కూడిన నందెన్న విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువుదీర్చారు. వరి దుబ్బులను గౌరమ్మగా పూజించారు. బిందెలు, ముంతల్లో(ఇత్తడి కళశాలు) జ్యోతులు వెలిగించారు. ఊరేగింపులో భాగంగా ఆయా గ్రామస్థులు ఏర్పాటు చేసిన వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వాల్మీకి రామాయణం అనే మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతారాములు సద్గుణాలు, వారి గొప్పదనాన్ని సమాజానికి చెప్పారని అన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. రామాయణం సామాజిక నీతిని బోధిస్తుందని తెలిపారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని వాల్మీకి జీవిత చరిత్ర తెలియజేస్తుందన్నారు. వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం వాల్మీకి కుల సంఘ నాయకులు వాల్మీకి విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ అధ్యక్షుడు కర్రోతు బంగార్రాజు, జేసీ సేతుమాధవన్, డీఆర్వో అనిత, బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు, ఏబీసీడబ్ల్యూవో యశోదనరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

కొందరికి లక్ మరికొందరికి ఝలక్



- మద్యం దుకాణాల లాటరీలో కొందరికే కలిసొచ్చిన అదృష్టం
- ఒక్క దరఖాస్తుతోనే దక్కిన షాపులు
- 150 దరఖాస్తులు చేసినా దక్కినవి ఒకట్రెండే

శృంగవరపుకోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఒకే మద్యం దుకాణానికి దరఖాస్తు చేశాడు. లాటరీలో ఆ మద్యం దుకాణం దక్కింది. ఇదే విధంగా లక్కవరపుకోట మండలం గేదలవాని పాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూడు మద్యం దుకాణాలకు రూ.2లక్షల చొప్పున డిపాజిట్‌ను ప్రభుత్వానికి కట్టాడు. ఇతనికి లాటరీలో రెండు దుకాణాలు వచ్చాయి. కేవలం ఒక దుకాణానికి మాత్రమే డిపాజిట్‌ను కోల్పోయాడు.

లక్కవరపుకోట మండల పరిధిలోని ఓ సిండికేట్.. భీమాళి గ్రామానికి చెందిన తల్లికూతుళ్ల పేరున రెండు దుకాణాలకు డిపాజిట్ చెల్లించారు. వీరిద్దరికీ అదృష్టం కలిసొచ్చింది. చెరో మద్యం దుకాణానికి యజమానులు అయ్యారు. ఈ సిండికేట్ 45 మద్యం దుకాణాలకు రూ.2లక్షల చొప్పున డిపాజిట్ చేస్తే 11 మద్యం దుకాణాల వరకు లాటరీలో పొందారు. జిల్లాలో అత్యధిక మద్యం దుకాణాలను ఈ సిండికేట్ పొందినట్లు సమాచారం.


శృంగవరపుకోటకు చెందిన కొంత మంది కలసి సిండికేట్‌గా మద్యం దుకాణాలను పొందేందుకు తలా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఈ మొత్తంతో 144 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేశారు. రూ.2లక్షల చొప్పున 2.88 కోట్లను ప్రభుత్వానికి డిపాజిట్ చేశారు. వీరికి కేవలం రెండు మద్యం దుకాణాలు మాత్రమే లాటరీలో దక్కాయి. డిపాజిట్‌ను తిరిగి ప్రభుత్వం చెల్లించకపోవడంతో రూ.2.84కోట్లు వీరంతా నష్టపోయారు.

లక్కవరపుకోట మండల పరిధిలోని మరో సిండికేట్ 150 మద్యం దుకాణాలకు రూ.3కోట్లు డిపాజిట్ చేశారు. వీరికి రెండు మద్యం దుకాణాలు నడుపుకొనేందుకు అనుమతులు వచ్చాయి. రూ.2.96కోట్లు ప్రభుత్వం నుంచి తీసుకునేందుకు అవకాశాన్ని కోల్పోయారు.

శృంగవరపుకోట అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల కేటాయింపులో కొందరికి అదృష్టం కలిసొస్తే.. మరికొందరికి దురదృష్టం వెంటాడింది. మద్యం దుకాణాలు పొందిన వారి ముఖాలు వెలిగిపోతుంటే.. దక్కనివారి ముఖాలు మాడిపోయాయి. ప్రధానంగా సిండికేట్ గా ఏర్పడి దరఖాస్తులు వేసిన వారి అంచనాలు తారుమారయ్యాయి. సోమవారం జిల్లాలో 153 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించారు. ఒక్కో దుకాణానికి దరఖాస్తు చేసిన చాలామందికి ఈ లాటరీలో షాపులు దక్కాయి. 15 నుంచి 50 మంది వరకు సిండికేట్‌గా ఏర్పడి వంద, నూటయాభై వరకు దుకాణాలకు రూ.2లక్షల చొప్పున డిపాజిట్ కట్టిన వారికి మూడు, నాలుగు మద్యం దుకాణాల లోపే రావడంతో ఖంగుతిన్నారు. గతంలో వీరంతా మద్యం వ్యాపారం చేసిన వారే. అయితే, గత వైసీపీ ప్రభుత్వం సొంతంగా మద్యం దుకాణాలు నడపడంతో వీరంతా తమ వ్యాపారాలను కోల్పోయారు. గత ఐదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో మద్యం టెండర్లలో పాల్గొంటూ ఒకట్రెండు దుకాణాలను దక్కించుకుని నడుపుకుంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది. దీంతో వీరంతా మళ్లీ మద్యం వ్యాపారంలోకి దిగారు. అయితే, లాటరీలో మాత్రం అదృష్టం కలిసిరా లేదు. దీంతో వీరు మద్యం వ్యాపారంలో పెద్దగా అనుభవం లేకుండా దుకాణాలను పొందిన వారిపై దృష్టిసారించారు. గుడ్‌విల్‌గా వారు కట్టిన డిపాజిట్ సొమ్ముకు 20 నుంచి 30 రెట్లు అధికంగా ముట్టజెప్పేందుకు చూస్తున్నారు. దీనికి ససేమీరాన్న వారికి దుకాణం ఏర్పాటు చేసుకొనేందుకు గదులు దొరకకుండా అడ్డుకుంటున్నారు. అలాగే, రూ.కోట్లలో డిపాజిట్‌ను కోల్పోయిన సిండికేట్లు తిరిగి ఆ సొమ్మును రాబట్టుకొనేందుకు పథకం వేస్తున్నారు. తమకు దక్కిన రెండు మూడు దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా అమ్మకాలు చేసేందుకు ఉన్న అవకాశాలను వెతుకుతున్నారు. అలాగే, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులకు ఆనుకుని మద్యం దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధుల సహకారం కోరుతున్నట్లు తెలుస్తోంది.

కొత్త షాపులు.. పాత బ్రాండ్లు..

- ఇంకా 'జే' బ్రాండ్లే విక్రయం
- ఒకట్రెండు మినహా పాత ధరలే
- మద్యంప్రియుల్లో అసంతృప్తి



రాజాం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తసీసాలో పాత సారా అన్న చందంగా ఉంది నూతన మద్యం పాలసీ. కొత్త పాలసీ అమలులోకి వచ్చి రెండు రోజులవుతున్నా ఇంకా జే-బ్రాండ్లు మందుబాబుల్ని వెంటాడుతున్నాయి. కొన్ని సాంకేతిక సమస్యలతో మరో వారం పది రోజులు ఒకట్రెండు కొత్త బ్రాండ్లు మినహా మిగతావన్నీ పాత ధరలు, పాత బ్రాండ్లనే షాపుల్లో అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మందుబాబులు అసంతృప్తి, అసహనం వెల్లగక్కుతున్నారు. జిల్లాలో 153 మద్యం షాపులను వ్యాపారులు లాటరీ ద్వారా దక్కించుకున్నారు. అయితే, ఈ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సరైన సెంటర్లలో అద్దె గదులు దొరకడం లేదు. ఒకవేళ దొరికినా భారీగా అద్దె ఉండడంతో పూర్తిస్థాయిలో షాపులు ప్రారంభించలేదు. కొన్నిచోట్ల బుధవారం ఉదయం షాపులు ప్రారంభించారు. ఆ రోజు రాత్రికే ఆ షాపుల్లో మద్యం సరుకంతా అమ్మేశారు. దీంతో గురువారం ఉదయం ఆ దుకాణాలు తెరుచుకోని పరిస్థితి నెలకొంది. కొన్ని దుకాణాల్లో ఇంకా పాత సీసాలే దర్శనమిస్తున్నాయి. బ్రాండెడ్ మద్యం కనిపించడం లేదు. ప్రధానంగా రూ.99కే క్వార్టర్ బాటిల్ అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, జిల్లాలో ఎక్కడా అవి కనిపించకపోవడంతో షాపుల యజమానులతో మందుబాబులు వాగ్వాదానికి దిగుతున్నారు. మరో వారం పదిరోజుల వరకూ ఇవే బ్రాండ్లు అందుబాటులో ఉంటాయని వ్యాపారులు, ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా మందుబాబులు సంతృప్తి చెందడంలేదు.

ఇంకా పాత సరుకే..

ఇంపీరియల్ బ్లూ, ఎంసీ విస్కీ మినహా మిగతావన్నీ గత వైసీపీ పాలనలో విక్రయించిన జే బ్రాండ్లే ప్రస్తుత మద్యం షాపుల్లో లభ్యమవుతున్నాయి. ఐబీ, ఎంసీ విస్కీ క్వార్టర్ బాటిల్ ధర రూ.180, హాఫ్ రూ.360, ఫుల్‌బాటిల్ రూ.720 కాగా, రాయల్‌గ్రీన్, ఎంహెచ్, బీ7, సిల్వర్ స్ట్రైప్స్, గోల్డెన్ స్ట్రైప్స్, రాయల్ స్టాగ్ తదితర క్వార్టర్ బాటిళ్లు గతంలో మాదిరిగా రూ.220 నుంచి రూ.230గా ధరలు ఉన్నాయి. అలాగే బీర్లు సైతం పాతధరే కావడంతో మందుబాబులు అసంతృప్తి చెందుతున్నారు. మరో పదిరోజులు ఈ బ్రాండ్లనే విక్రయించనున్నారు. పట్టణాల్లో మద్యం ప్రియులు అధిక ధరలు చెల్లించి బార్లను ఆశ్రయిస్తున్నారు.

గంటస్తంభం



గంటస్తంభం.. గత వైభవ చిహ్నం!

- విజయనగరం ప్రాశస్త్యాన్ని చాటుతున్న వైనం
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న నిర్మాణం

విజయనగరం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరం... ఈ పేరు ఎక్కడ వినిపించినా ఠక్కున మనకు గుర్తుకు వచ్చేది గంటస్తంభం. ఈ విశిష్ట నగరంలో చారిత్రక చిహ్నాలకు కొదవలేదు. వీటిలో ఒకటే నగరం నడిబొడ్డున ఉన్న గంటస్తంభం (క్లాక్ టవర్). ఇది బ్రిటిష్ కాలం నాటిది. నేటికీ చెక్కు చెదరని ఈ నిర్మాణం ఇక్కడికి వచ్చే వారిని ఎంతగానో ఆకట్టుకుంటోంది. 1885లో దీనిని నిర్మించారు. తొలి నాళ్లలో తెల్లటి పైభాగంతో.. చుట్టూ ఇసుక రంగు ఉండేది. 68 అడుగుల ఎత్తయిన అష్టభుజి గోపురం దీని ప్రత్యేకత. పూర్వ కాలంలో దీనిలో గంటలు ఉండేవి. గడియారాలు అందుబాటులో లేని సమయంలో.. ఈ స్తంభంలో ఏర్పాటు చేసిన గంటల ద్వారా సమయాన్ని తెలియజేసేవారు. కాలక్రమేణా బ్రిటిష్ వారు ఈ స్తంభానికి ఇరువైపులా గడియారాలు ఏర్పాటు చేశారు. ఆ తరువాత కాలంలో దీనికి రంగు మార్చారు. పైన ఎరుపు రంగు, చుట్టూ క్రీమ్ రంగుతో ప్రస్తుతం గంట స్తంభం ఉంది. రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య ఈ చారిత్రక చిహ్నం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విజయనగరం పేరు చెబితే గుర్తొచ్చే వాటిలో ఇది కూడా ఒకటిగా గుర్తింపు పొందింది. నగర నడిబొడ్డున ఉన్న గంట స్తంభం చుట్టూ వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

విద్యుత్ దీపాల కాంతుల మధ్య గంటస్తంభం విరాజిల్లుతోంది. దీని గురించి నగర పాలక సంస్థ అధికారులు పెద్దగా పట్టించుకోవడం మానేశారు. ప్రస్తుతం దీనికి ఉన్న సైరన్ పని చేయడం లేదు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలు... మధ్యాహ్నం 12... రాత్రి 8 గంటలకు సైరన్ పలికేది. ఈ సైరన్ పనిచేసే విధంగా చూడాలని నగర వాసులు కోరుతున్నారు. దీని చరిత్రను...విశిష్టతను పర్యాటకులు తెలుసుకునే విధంగా నగర వ్యాప్తంగా తగిన ఏర్పాట్లు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

మూడు లాంతర్లు.. వారసత్వ వెలుగులు

మూడు లాంతర్లు (కొత్తవి)




- పూర్వం దారి చూపే దీపాలు
- ఇప్పుడు చారిత్రక ఆనవాలు
- కొత్తగా నిర్మించినా... పేరు అదే



గతంలో ఉన్న మూడు లాంతర్లు

విజయనగరం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పేరు చెప్పగానే కోట... గంటస్తంభాల తరువాత గుర్తుకువచ్చే కట్టడాల్లో మూడు లాంతర్లు ముందుంటుంది. ఇదీ పురాతన నిర్మాణమే. ఏటా విజయనగరం ఉత్సవాలు... ఆ వెంటనే వచ్చే పైడిమాంబ సిరి మానోత్సవానికి గాను అధికారులు మూడులాంతర్లను కూడా ప్రత్యే కంగా విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. విద్యుత్ సదుపాయం లేని రోజుల్లో ఆనాటి పురపాలక సంఘ అధికారులు మూడు లాంతర్లను ఏర్పాటు చేశారు. ఎడ్ల బండ్లపై నగరానికి వచ్చేవారు... పాదచారులు ఈ లాంతర్ల వెలుగుల ఆధారంగా తమ ప్రాంతాలకు దారి చూసుకుని వెళ్లేవారు. మూడు లాంతర్లలో ఒకటి నెల్లిమర్ల వైపు... రెండోది ధర్మపురి వైపు.. మూడోది గంట స్తంభం వైపు ఉంటాయి. ఇది కూడా పురాతనంగా వస్తున్నదే. ఈ మూడు లాంతర్ల చుట్టూ వ్యా పార, వాణిజ్య సముదాయాలతో పాటు, పైడిమాంబ చదురుగుడి ఉండడంతో నిత్యం ఈ కూడలి రద్దీగా ఉంటుంది. ఏదైనా పండుగ.. పర్వదినాల్లో ఈ జంక్షన్ ప్రజలతో రద్దీగా ఉంటుంది. విజయనగరంతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ మూడు లాంతర్లు సుపరిచితమే. 2019లో ఆనాటి పాలకులు మూడు లాంతర్లను ఆధునికీకరించాలని నిర్ణయించారు. ఆధునిక హంగులు అద్ది.. 2021లో పురాతన నిర్మాణాన్ని తొలగించి.. ఆ స్థానంలో కొత్తది నిర్మించారు. రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జాతీయ నాయకుల విగ్రహాలను దీని లో ఏర్పాటు చేశారు. ఈ పురాతన నిర్మాణాన్ని తొలగించడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది. కానీ కొత్తగా ఆ స్థానంలోనే నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రాంతీయులు కొంత వరకు శాంతించారు.

అయ్యప్ప భక్తులు



అప్పట్లో మొక్కుకొని.. ఇప్పుడు మాల వేయించి!

- టీడీపీ నాయకుడి అయ్యప్ప దీక్ష



గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో గెలిస్తే... 200 మందితో అయ్యప్ప మాల వేయించి... 40 రోజులు భిక్ష పెట్టి.. స్వామి సన్నిధానానికి తీసుకెళతానని గుమ్మలక్ష్మీపురం మండల పార్టీ కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు అప్పట్లో మొక్కుకున్నారు. ఆయన కోరుకున్నట్టే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గురువారం 160 మంది అయ్యప్ప భక్తులకు తన సొంత ఖర్చులతో అయ్యప్ప మాల వేయించారు. వీరందరికీ సన్నిధానం ఏర్పాటు చేసి 40 రోజులు భిక్ష పెట్టనున్నారు. దీక్ష పూర్తయ్యాక నాలుగు బస్సుల్లో అయ్యప్ప సన్నిధికి తీసుకెళతారు. భక్తులకు మాల వేసిన అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా... కురుపాం నియోజకవర్గంలో తోయక జగదీశ్వరి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టారని... ఈ కారణంగానే తాను మొక్కు తీర్చుకుంటున్నానని తెలిపారు. అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లి... తిరిగి వచ్చే వరకు తాను బాధ్యత తీసుకొని ఖర్చులు భరిస్తానని చెప్పారు.

సాలూరు యార్డ్‌లో నిలిచి ఉన్న లారీలు



బతుకుబండి.. చక్రం తడబడి!

- నష్టాల బాటలో సాలూరు లారీ పరిశ్రమ
- డ్రైవర్లుగా మారుతున్న యజమానులు

సాలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి)

సాలూరు అంటే లారీ పరిశ్రమకు పెట్టింది పేరు. ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ తరువాత లారీ పరిశ్రమకు సంబంధించి సాలూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పదేళ్ల క్రితం వరకు ఉజ్వలంగా వెలిగిన సాలూరు లారీ పరిశ్రమ ప్రస్తుతం చతికిల పడిపోతోంది. ఒకప్పుడు లారీ డ్రైవర్లు కష్టించి పనిచేసి యజమానుల య్యారు. ప్రస్తుతం కొంతమంది యజమానులు వాటిని నిర్వహించలేక... విక్రయించి లారీ డ్రైవర్లుగా వెళితే బాగుంటుందనే భావనకు వచ్చారు. ఇప్పటికే 28 మంది లారీల యాజమానులు డ్రైవర్లుగా మారి బతుకు పోరాటం కొనసాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం లారీలపై ఎడాపెడా పన్నుల భారం, క్వార్టర్ ట్యాక్స్, డీజిల్ భారం పెంచింది. దీంతో లారీ చక్రం తిరగడానికి తడబడుతుండడంతో... యాజమానుల బతుకు దయనీయంగా మారింది. సాలూరు పట్టణ వాసుల్లో అత్యధికులకు లారీలే జీవనాధారం. ప్రస్తుతం ఇక్కడ రెండు వేలకు పైగా లారీలు ఉన్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కొక్క లారీపై సగటున ఐదు కార్మిక కుటుంబాలు ఆధారపడి ఉంటున్నాయి. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి.

పన్నుల బాదుడు..

లారీలపై గత ప్రభుత్వం ఎడాపెడా పన్నుల భారం పెంచి... వాటి మనుగడపై భారం మోపింది. రాష్ట్రంలో 2021 నుంచి లారీల జీవిత కాలం ఆధారంగా హరితపన్ను (గ్రీన్ ట్యాక్స్) విధించింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పన్ను కేవలం రూ.200 ఉండేది. దానిని 2021 నుంచి ఒకేసారి భారీగా పెంచింది. లారీ ఎనిమిదేళ్లు దాటి వినియోగంలో ఉంటే రూ. 4,200, 12 ఏళ్లు దాటితే రూ.8,100, 15 ఏళ్లు దాటితే రూ.20,200 గ్రీన్ ట్యాక్స్‌ను విధించడంతో లారీ యాజమానులపై భారం పడింది. అంతేకాక త్రైమాసిక పన్ను సైతం రూ.8000 నుంచి రూ.15000కు పెంచిందని యాజమానులు వాపోతున్నారు. దీనికి తోడు రాష్ట్రంలో డీజిల్‌పై వ్యాట్ పెరగడంతో ఇతర రాష్ట్రాల కంటే ఇంధన భారం అధికంగా ఉందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక కంటే రూ.11, తెలంగాణ కంటే రూ. 2, ఛత్తీస్‌ఘడ్ కంటే రూ.4 రాష్ట్రంలో లీటర్ డీజిల్‌కు అదనపు భారం మోస్తున్నారు.

అపరాధ రుసుం..

వివిధ అంశాలకు సంబంధించిన అపరాధ రుసుం కూడా గత ప్రభుత్వం భారీగా పెంచింది. నిర్ణీత ఎత్తు కంటే అధికంగా ఉంటే రూ.20 వేల వరకు అపరాధం రుసుం విధిస్తున్నారు. నడుస్తున్నప్పుడు 10 నుంచి 16 టైర్ల లారీల చక్రాలు ఎత్తి ఉండడం వాటిపైనా అపరాధ రుసుం భారీగా ఉంటోందని యజమానులు చెబుతున్నారు.

టోల్ భారం..

లారీలపై టోల్ ఫీజు కూడా అధికంగా ఉంటోంది. విశాఖ నుంచి రాయ్‌పూర్ మధ్యలో జొన్నాడ, కురోద్ వద్ద ఇటీవల మరో రెండు టోల్ గేట్లు ఏర్పాటు చేశారన్నారు. ఇరువైపులా టోల్ చార్జీలే రూ.5000 వరకు అవుతున్నాయని లారీల యజమానులు వాపోతున్నారు.



ఇక్కడే టైర్లకూ మెరుగులు..

గిట్టుబాటు కావడం లేదు..

లారీలకు కిరాయి గిట్టుబాటు కావడం లేదని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 16 టైర్ల లారీ విశాఖ నుంచి రాయ్‌పూర్‌కు వెళ్లి విశాఖ వస్తే కిరాయి రూ. 98 వేలు, 14 టైర్ల లారీకి రూ. 84 వేలు వసూలు చేస్తున్నారు. డీజిల్, ఇతర ఖర్చులు రూ.76 వేలు అవుతున్నాయి. నెలకు నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు ఉండేవి. ఇలా అయితే ట్రిప్‌కు రూ. 15 నుంచి రూ.20 వేల వరకు మిగిలేదు. దీంతో ఏడాదికి రవాణా, బీమా, జాతీయ పర్మిట్ పన్నులు చెల్లించేవారు. ప్రస్తుతం మూడు ట్రిప్పులు కావడమే గగనంగా మారడం, ట్రిప్పుకు రూ.5 వేలు మాత్రమే మిగులు కనిపించడంతో పన్నులు చెల్లించలేక, లారీని నడపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరాయి గిట్టుబాటు కాకపోవడంతో ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక అవస్థలు పడుతున్నామని అంటున్నారు. వాయిదాలు సక్రమంగా చెల్లించని 32 లారీలు ప్రస్తుతం విశాఖ ఫైనాన్స్ కంపెనీల యార్డ్‌లో ఉన్నాయి.

పన్నులు తగ్గించాలి

లారీలను నడపడానికి పన్నుల భారమే ప్రధాన అడ్డంకి. లారీ లోడుకు వెళ్లి వస్తే నష్టమే తప్ప లాభం ఉండడం లేదు. లారీ పరిశ్రమను కాపాడానికి ప్రభుత్వం పన్నులను తగ్గించాలి.

-కెల్ల అప్పారావు, లారీ యాజమాని, సాలూరు

డ్రైవర్‌గా మిగిలా..



నాకు లారీలు ఉండేవి. వాటి నిర్వహణలో నష్టాలు వచ్చాయి. వాటిని నడపడం వల్ల బాధలే తప్ప సుఖం లేకుండా పోయింది. అందుకే లారీలను నష్టానికే అమ్మేశాను. ప్రస్తుతం ఒకరి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాను.

-సిగల మోహనరావు, లారీ డ్రైవర్, సాలూరు

లైన్‌లో చెల్లింపులే అధికం



లారీ లోడుతో లైన్‌కు వెళితే చెల్లింపులే అధికం. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో కొన్ని విభాగాలకు నెలవారీ మామూళ్లు ఇవ్వాలి. టోల్ ట్యాక్స్‌లు, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చుల భారం ఎలాగూ ఉంటోంది. దీంతో యాజమానులకు మిగులు కనిపించడం లేదు.

-బవిరెడ్డి శేఖర్, లారీ క్లీనర్, సాలూరు

ఇన్నాళ్లకు పున్నమి వచ్చే!

పార్వతీపురం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తవలస పెద్దవీధిలో కొత్తపోలమ్మ తల్లి యూత్ కమిటీ సభ్యులు గౌరీ పౌర్ణమి సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. జిల్లా వ్యాప్తంగా పౌర్ణమి పూజలు చేస్తున్నారు కదా... మరి ఇక్కడ ప్రత్యేకత ఏంటీ అనుకుంటున్నారా? అదే మరి విశేషం. ఇక్కడ మొదటిసారిగా పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మేళతాళాల నడుమ ఊరేగింపుగా విగ్రహాలను తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పార్వతీ పరమేశ్వరులను పూజిస్తామని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అనుపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.



కొత్తవలస పెద్దవీధిలో ప్రతిష్ఠించిన పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు

ఘనంగా గౌరీపౌర్ణమి ఉత్సవాలు..

గరుగుబిల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గౌరీపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి నంది వాహనంపై ఉంచిన ఈశ్వరుడు, పార్వతి, గంగ ప్రతిమలను నిర్వాహకులు మేళతాళాలతో ఊరేగింపుగా తరలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేపట్టారు. గరుగుబిల్లి, రావుపల్లి, గొట్టివలస, తదితర గ్రామాల్లో గౌరీపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రావివలస, శివ్వాం, తదితర గ్రామాల్లో గురువారం నుంచి గౌరీపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నారు.



వైభవంగా మణిద్వీప వర్ణన

సాలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాలూరు పెదకోమటిపేట రామాలయంలో లలితాదేవికి గురువారం మణిద్వీప వర్ణన పూజలు వైభవంగా నిర్వహించారు. ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేకంగా పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మణిద్వీప వర్ణన పూజ చేస్తున్న మహిళలు

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

- పల్లెపండగలో ఎమ్మెల్యేలు
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


రామభద్రపురం: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన


ఎస్.కోటరూరల్: అలుగుబిల్లిలో ఎద్దుల బండిపై వస్తున్న ఎమ్మెల్యే కోళ్ల


పూసపాటిరేగ: చౌడవాడలో బీటీరోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, కర్రోతు


గరివిడి: మెరకముడిదాంలో మాట్లాడుతున్న కళా వెంకటరావు

రామభద్రపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మండలంలోని తారాపురం గ్రామంలో గురువారం పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకం నిధులు రూ.5 కోట్ల 13 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్స్‌కు భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతిరావు, విజయభాస్కర్, భవిరెడ్డి శంకరరావు, బెవర సీతారాం, ఎంపీటీసీ సభ్యులు భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్: మండలంలోని అలుగుబిల్లిలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి, పంచాయతీ ఎంపీటీసీ రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమెను ఎద్దులబండిపై ఊరేగించారు. అనంతరం పల్లెపండుగలలో బాగంగా పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన పూజలుచేశారు. ఎంపీపీ సోమేశ్వరరావు,మాజీ ఎంపీపీ వెంకన్న, జీఎస్ నాయుడు, జుత్తాడ రామసత్యం, తదితరులు పాల్గొన్నారు.

జామి: మండలంలోని వున్న గ్రామాలకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పల్లెపండుగ ద్వారా మహార్దశ వస్తుందని మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు అన్నారు. గురువారం మండలంలోని అన్నంరాజుపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనీ పలు కార్యక్రమాలకు శంకు స్థాపన పూజలు చేశారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని గున్నతోటవలస, కలవరాయి, దిబ్బగుడ్డివలస గ్రామాలలో గురువారం పల్లె పండగ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు పాల్గొని ఉపాధి హామీ పథకంలో విడుదలైన నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు జరిగాయి. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులున్నారు.

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ మధుర గ్రామమైన ఎరుకులపా కలు నుంచి లక్ష్మీపురం వెళ్లే రహదారి నిర్మాణానికి పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపీటీసీ, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, మాజీ సర్పంచ్ జోగారావు, ఆనందరావు, సచివాలయ సిబ్బందితో కలిసి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు.

వేపాడ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామాల్లో 4,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టిందని టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ అన్నా రు. గురువారం మండలంలోని ఆయన స్వగ్రామం అంకాజోస్యులపాలెం గ్రామంలో సి మ్మెంటు రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. మండల నాయకులు గుమ్మడి భారతి, బానాది ఎంపీటీసీ గొంప తులసి, కేఆర్‌పేట సర్పంచ్ బాలబాబు, ప లు గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గరివిడి(మెరకముడిదాం): గ్రామాలను పట్టణాల వలె అభివృద్ధి చేయడమే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తెలి పారు. గురువారం మెరకముడిదాంలో పల్లె పండుగ కార్యక్రమంలో పలు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్ పాలొన్నారు.

వీరఘట్టం: నియోజకవర్గంలో గ్రామాల్లోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని ఎ మ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని కంబర గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్డు పను లకు శంకుస్థాపన చేశారు. కార్యక్ర మంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, కూటమి నాయకులు ఉద యాన ఉదయ్ భాస్కర్, చింత ఉమ, గర్భాపు సత్తిబాబు, ఎంపీ డీవో బి.వెంకటరమణ, ఈఈ సింహాచలం, ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతు లు, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెల్లూరు, బడుకొండపేట, మలిచర్ల, సుంకరిపేట, రీమాపేట, ముడిదాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.


విజయనగరం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి


వేపాడ: అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన గొంప కృష్ణ


వీరఘట్టం: కంబర రోడ్డు పనులను శంకుస్థాపనలో జయకృష్ణ

సెలవుపై వచ్చి.. చెరువులో జారిపడి

- చంద్రంపేటలో హోంగార్డు మృతి


సింహగిరి (ఫైల్)

కొమరాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న చంద్రంపేట గ్రామానికి చెందిన గార సింహగిరి చెరువులో జారిపడిమృతి చెందాడు. కొమరాడ పోలీసులు, స్థానికులు, కుటుంబ స భ్యుల కథనం మేరకు.. తెలంగాణలో సింహగిరి హోంగా ర్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య భవాని 22 రోజుల కిందట రెండో బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ పుట్టాడన్న స మాచారం మేరకు హైదరాబాద్ నుంచి చంద్రంపేటకు ఇటీవల సెలవుపై వ చ్చాడు. గురువారం బహిర్భూమికని వెళ్లి చెరువు వద్ద కాలుజారి పడిపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి కానిస్టేబుల్ మృతి


బుల్లిబాబు (ఫైల్)

కురుపాం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కె.బుల్లిబాబు (48) దుర్మరణం పాలయ్యారు. పోలీసు లు, స్థానికుల కథనం మేరకు.. ఎల్విన్‌పేట స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు హిరమండలం నుంచి బుల్లిబాబు గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.జరడ- నీలకంఠాపురం ఘాట్ రోడ్డులో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడి అ క్కడికక్కడే మరణించారు. పాలకొండ సమీపంలోని గొట్టమంగళాపురం గ్రామాని కి చెందిన బుల్లిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నీలకంఠాపురం పోలీ సులు కేసును నమోదు చేశారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి..

గరివిడి, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): గరివిడి రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఈ మేరకు ఆమదాలవలస రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట ఘటనలో పదిమందిపై కేసు

రేగిడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిశ కొట్లాట ఘటనపై గురు వారం ఇరుకుటుంబాలకు చెందిన పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీ లావతి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నెల్లి పెంటన్నాయుడు, నెల్లి సతీష్ ఇచ్చుకున్న పరస్పర ఫిర్యాదుల మేరకు వీరితో పాటు మరో ఎనిమిదిమందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

శృంగవరపుకోట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుడిని గు రువారం ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. 2021 అక్టోబర్‌లో బొడ్డవర చెక్‌పోస్టు వద్ద ఒక కారులో 90కేజీల గంజాయి దొరికిందని, దీనిని తరలిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడకు చెందిన పాంగి కృష్ణ పరారయ్యాడన్నారు. ఇతని కదలికలపై నిఘా ఉంచామని, సదరు వ్యక్తి ఎస్.కోట కాంప్లెక్స్‌లో తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే వెళ్లి అరెస్ట్ చేశామని, అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపరిచామన్నారు.

పిడుగు పడి గృహోపకరణాలు దగ్ధం

వంగర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం వర్షంతో పాటు ఒక్కసారిగా ఇంటికి ఆనుకుని పిడుగు పడటంతో అవు లక్ష్మణకు చెందిన పలు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వర్షం పడిన సమయమంలో భార్యాభర్తలు ఇంటిలో లేకపోవటంతో పెద్దప్రమాదం తప్పినట్లు స్థానికులు చెపుతున్నారు. ఇంటి పక్కనే పిడుగు పడటంతో ఇంటిగోడలు బీటలు వారగా, విద్యుత్ పరికరాలు , 6 ఫ్యాన్లు, ఇన్వెర్టర్, టీవీ, ఏసీ, ఒక జిరాక్సు మిషన్ కాలిపోయినట్లు బాధితులు తెలి పారు. ఆస్తి నష్టం రూ. 3 లక్షల వరకూ ఉంటుందని అంచనా వేశారు.

సరసమైన ధరలకే సరుకులు అందించండి

- ధరల స్థిరీకరణ సమావేశంలో జేసీ సేతుమాధవన్

కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులను సరసమైన ధర లకు అందించాలని జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. మార్కెట్‌లో ధరలు పెరగ కుండా టోకు వర్తకులు సహకరించాలని కోరారు. గురువారం జేసీ తన చాంబర్‌లో ధరల స్థిరీకరణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ టమోటా, ఉల్లి, బంగాళా దుంపలు స్థానికంగా ఉత్పత్తి లేనందున టోకు వర్తకులపై ఆధార పడాల్సి వస్తుందని చెప్పారు. వారు అధిక లాభాలకు విక్రయించకుండా , నష్టం జరగకుండా సరసంగా ఉండే ధరలకు ప్రజలకు అమ్మేలా సహకరించాలని కోరారు. రైతు బజారులో బియ్యం, కందిప ప్పులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని తెలిపారు. పామాయిల్ కిలో రూ.110, సన్‌ఫ్లవర్ కిలో రూ.124కు విక్రయించాలని సూ చించారు. టమోటాను విజయనగరం రైతు బజారులో రూ.45 కే అందించామని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్, డీఎస్ వో మధుసూధన్, ఉద్యాన, వ్యవసాయ శాఖ ఏడీలు శైలజ, అన్నపూర్ణ, రైతు బజారు ఎస్టేట్ అధికా రులు వెంకట సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి

మక్కువ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన బోధన అందించా లని పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. గురువారం అనసభద్రలో ఏకలవ్య పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎర్ర సామంతవలస గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలకు చేరుకుని ఆహార నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు.

బానాదిలో డీఎల్‌పీవో విచారణ

వేపాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాది గ్రామ పంచాయతీ ఇన్ చార్జి కార్యదర్శి అలుగోజు మూర్తిపై గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీవో డి.మోహనరావు గురువారం బానాది గ్రా మంలో బహిరంగ విచారణ చేపట్టారు. అలుగోజు మూర్తి పంచాయతీ కార్యదర్శిగా బాధ్య తలు చేపట్టిన నాటి నుంచి సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, గ్రామ పంచా యతీ సమావేశం నిర్వహించాలని కోరినా సమావేశం నిర్వహించడం లేదని, పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, కనీసం పట్టించుకోవడం లేదని, గ్రామ సభకు సర్పంచ్‌ను ఆ హ్వానించడం లేదంటూ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు మూకుమ్మడిగా డీ ఎల్‌పీవో మోహనరావును ఎదుట వాపోయారు. ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దని, ఈ యనను బదిలీ చేయాలంటూ డిమాండ్ చేశారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్యంపై పరిశీలన చేసి కార్యదర్శి తీరుపై చర్యలు తీసుకోవాలని కోరడంతో డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ రవి గ్రామంలో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్య దర్శిమూర్తిని గ్రామ పరిస్థితులపై ప్రశ్నించగా రాతపూర్వకంగా సమాధానం చెప్తానన డంతో డీఎల్‌పీవో అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఎస్సీ కాలనీకి ఆనుకొని ఉన్న డంపింగ్ యర్డును పరిశీలించి రేపటికల్లా చెత్తా చెదారాలను తొలగించాలని పంచా యతీ కార్యదర్శికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్య దర్శి పనితీరుపై రెండు రోజుల్లో సమగ్ర నివేదిక తయారు చేసి కలెక్టర్‌కి నివేదిస్తాన న్నారు. ఈ విచారణలో ఈవోపీఆర్డీ రవికుమార్, గ్రామ సర్పంచ్ యశోద, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


కార్యదర్శి పనితీరుపై డీఎల్‌పీవోకి వివరిస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు

సమాజ నిర్మాతలను గౌరవించుకోవాలి

బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన విశ్రాంత ఉపాధ్యాయులను గౌరవించుకోవడం కనీస మర్యాదగా భావించి ఏటా సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్నామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ నేత రౌతు రామ్మూర్తి ఆధ్వర్యంలో గురువారం బొబ్బిలి కోటలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వందమంది రిటైర్డ్ టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత విద్యార్థులకు సంస్కారాన్ని, విద్యాబుద్ధులను, మంచినడవడికను అలవరచేది ఉపాధ్యాయులేనని అన్నారు. బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలకు చెందిన వందమంది రిటైర్డ్ ఉపాధ్యాయులందరినీ దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. టీడీపీ నాయకులు రాంబార్కి శరత్‌బాబు, సుంకరి సాయిరమేష్, వాసిరెడ్డి సత్యనారాయణ, తెంటు చిరంజీవిరావు, చింతల చిన్నమ్మతల్లి, నంది హరిప్రకాశ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు పాల్గొన్నారు.

విద్యాలయాల దగ్గర మద్యం షాపులు వద్దు

రామభద్రపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తగా మంజూరైన బ్రాందీషాపులను విద్యాలయాలు, ప్రార్థనా స్థలాలు, ఆసుపత్రులకు వంద మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని బొబ్బిలి ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు సూచించారు. మండలంలోని పాత బ్రాందీ షాపుల వద్ద ఉన్న సరుకును గురువారం రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జాతీయ రహదారికి 220 మీటర్ల దూరంలో బ్రాందీషాపులు ఉండేలా ప్రభుత్వం నిబంధనలు విధించిందన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి పాల్గొన్నారు.

రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భోగాపురం మండలం రావాడ గ్రామంలో వారసత్వంగా ఉన్న 7 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు రికార్డులు మార్చి వేరేవాళ్లకి రిజిస్ట్రేషన్ చేశారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని చందాల వెంకటరమణ ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వోని కలిసి వినతిపత్రం అందించానని తెలిపారు.

నగరపాలక సంస్థ ఏసీపీకి శుభాకాంక్షలు


ఏసీపీ హరిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎల్‌టీపీ అసోసియేషన్ ప్రతినిధులు

దాసన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.హరిబాబు, టీపీఎస్ అనితను గురువారం ఎల్‌టీపీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదినారాయణ, శ్రీనివాస్‌రావు, పి.శ్రీనివాసరావుతో పాటు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్.టీ.పీల సమస్యల పరి ష్కారానికి సహ కరించాలని కోరారు. ఎస్సీ, టీపీఎస్‌ను కలిసిన వారిలో ఎల్‌టీపీ అసోసియేషన్ ప్రతి నిధులు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి పన్ను సకాలంలో చెల్లించండి


మాట్లాడుతున్న ముచ్చయ్య

కొత్తవలస, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : వృత్తి పన్ను సకాలంలో చెల్లించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని విజయనగరం జిల్లా గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఈస్టు సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ జి.బుచ్చయ్య అన్నారు. గురువారం కొత్తవలసలోని వాసవీకల్యాణ మండపంలో వర్తకులు, అకౌంటెంట్‌తో వృత్తి పన్ను బకాయిలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవలస మండలంలో సుమారు 17 లక్షల రూపాయలు వరకు వృత్తి పన్ను బకాయిలు ఉన్నట్టు గుర్తించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ఆర్.శ్రీనివాసరావు, వర్తక సంఘం ప్రతినిధులు విన్నకోట గౌతమ్, రేపాకు శ్రీనివాసరావు, కొల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దని మహిళల ఆందోళన

బొబ్బిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కంచరవీధిలోని బజారు రోడ్డు సమీపంలో కొత్తగా మంజూరైన మద్యం షాపును ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మహిళలు గురువారం రాత్రి ఆందోళన చేపట్టారు. నిత్యం మహిళలు తిరుగాడుతుంటారని, సమీపంలో ప్రైవేట్ పాఠశాల చాలా కాలంగా నడుస్తోందని, అమ్మవారి గుడి దగ్గరలోనే ఉందని మహిళలు మద్యం వ్యాపారులతో వాదిస్తూ తమ అభ్యంతరాన్ని తెలిపారు. వారికి మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు మద్దతు పలికారు. మహిళల ఆగ్రహాన్ని గ్రహించిన వ్యాపారులు షాపు తెరవకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. మద్యం షాపును ఇక్కడ పెట్టవద్దని, వేరే చోటుకు తరలించుకోవాల్సిందేనని మహిళలంతా పట్టుబడుతున్నారు. మొత్తం 90 మంది సంతకాలు చేశారు. పోలీసులకు, ఎక్సైజ్ పోలీసులకు దీనిపై శుక్రవారం వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.


బొబ్బిలి బజారు రోడ్డులో మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ఘనంగా నందెమ్మ పూజలు

వంగర అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో గురువారం నందెమ్మపూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి ముందుగా వరి దుబ్బుకు పూజలు నిర్వహించిన భక్తులు అనంతరం మట్టితో చేసిన పార్వతీ పరమేశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో విగ్రహాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కొత్తవలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గులివిందాడ గ్రామంలో కోజాగిరి పౌర్ణమి సందర్భంగా గురువారం నుంచి గౌరీపరమేశ్వర్లు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గవరవారి ఇంటి ఆడపడచుగా పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయ ప్రకారం గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి రోజు ఊరేగింపులు, ప్రత్యేక పూజాకార్యక్రమాల అనంతరం తొమ్మిదో నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వరి దుబ్బును తీసుకుని వచ్చి ప్రతిష్ఠ నిర్వహించారు.


గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని తీసుకొస్తున్న గ్రామస్థులు


ప్రతిష్ఠకు విగ్రహాన్ని తెస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

కేజీబీవీ ఉద్యోగాలకు 39 దరఖాస్తులు

వంగర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ బోధనేతర సిబ్బంది భర్తీ కోసం 39 దరఖాస్తులు వచ్చినట్లు ఎంఈవో దుర్గారావు తెలిపారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ కుక్ లకు 12, డే వాచ్ మెన్ 12 హెడ్ కుక్‌కు 8, స్వీపర్‌కు 2, స్కెవెంజర్‌కు 2 తో పాటు చౌకీదార్‌కు 2 వచ్చాయని, వాటిని డీఈవో కార్యాలయానికి పంపినట్లు తెలిపారు.

అయ్యప్పస్వాముల మాలధారణ



రాజాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాముల మాలాధారణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగంలో మల్లిఖార్జున నారాయణ సన్నిధానంలో గురుస్వామి నంది సూర్యప్రకాష్‌రావు 101 మంది స్వాములకు మాలాధారణ చేశారు. రెండు పూటల స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెపారరు.

వంగరలో ఓపెన్ స్కూల్ పరీక్షలు

వంగర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఓపెన్‌స్కూల్ 2024 సంవత్సరానికి 10, ఇంటర్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు కోరుతున్నట్టు కోఆర్డినేటర్ జయకృష్ణ తెలిపారు. గురువారం ఆయన వంగరలో విలేకరులతో మాట్లాడారు. ఇంటర్, 10 తరగతుల్లో ప్రవేశానికి అభ్యర్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు అర్హత పరీక్షకు వంగర జడ్పీకి హాజరుకావాల్సి ఉందన్నారు.

గద్దర్ సభను జయప్రదం చేయండి

రాజాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యం కోసం జీవితాన్నే అంకితం ఇచ్చిన మహోన్నతుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ అని మహజన నేతలు అన్నారు. అంబేడ్కర్ కూడలిలో ముందుగా గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం గద్దర్ సభకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఎస్ఐలకు తాత్కాలిక అటాచ్‌మెంట్ ఉత్తర్వులు

పార్వతీపురం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఎస్ఐలకు తాత్కాలిక అటాచ్‌మెంట్ చేస్తూ గురువారం ఎస్పీ ఎస్.వి.మాదవ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ దినకర్‌ను వీఆర్‌కు, పార్వతీపురం టౌన్ ఎస్ఐ బి.సంతోషికుమారిని పార్వతీపురం రూరల్ పోలీసు స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం

శృంగవరపుకోట: డయల్ యువర్ డిపో మేనేజర్ ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని మేనేజర్ రమేష్ అన్నారు. గురువారం నిర్వహించిన డయల్ యువర్ మేనేజర్ కు సమస్యలు ఫోన్‌ద్వారా తెలియజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్యలను తమ ఉన్నతాధికారుల దృష్టిలో పెడతామని తెలిపారు.

ఇరుముడుల ఆదాయం రూ.2.11 లక్షలు

రాజాం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినం సందర్భంగా నవదుర్గ అమ్మవారి దేవస్థానానికి భవానీ దీక్షాధారుల నుంచి ఇరుముడుల ద్వారా రూ.2,11,782 ఆదాయం సమకూరిందని ఈవో పొన్నాడ శ్యామలరావు తెలిపారు. దేవదాయశాఖ ఇనస్పెక్టర్ మాధవరావు సమక్షంలో గురువారం లెక్కించినట్లు ఆయన వివరించారు. కాగా అమ్మవారికి భక్తులు సమర్పించిన మొక్కుబడులు, కానుకలకు సంబంధించిన హుండీలను ఈనెల 22న తెరిచి లెక్కిస్తామని ఆయన తెలిపారు.

20న సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానీనగర్ డాక్టర్ వరలక్ష్మి స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ 10వ సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు 20 వ తేదీనుంచి నిర్వహిస్తున్నట్లు సంఘ, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు తెలిపారు. ఇక్కడ విజేతలకు వచ్చేనెల 8నుంచి 10వ తేదివరకు నంద్యాలలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 94409 63726ను సంప్రదించాలన్నారు.

అరకు వ్యాలీకి హెలీప్యాడ్ సేవలు ప్రారంభించాలి

రాజాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అరకు వ్యాలీకి హెలిప్యాడ్ సేవలు అందించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వినతిపత్రం గురువారం డిల్లీలో అందజేశారు. ఈ మేరకు వివరాలను ఫోన్‌లో స్థానిక విలేఖర్లకు తెలిపారు. ప్రస్తుతం అరకు వ్యాలీకి చేరుకోడంలో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగా హెలీప్యాడ్ ఏర్పాటుతో సులభమైన ప్రయాణ సదుపాయాలు కల్పించవచ్చునని ఆయన వివరించారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం

రాజాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కంచరాం మాజీ ఎంపీటీసీ సభ్యుడు మీసాల సత్యంనాయుడు అన్నారు. గురువారం గ్రా మంలో సిమ్మెంట్ రోడ్లుకు, కాలువలకు శంకుస్థాపన చేశారు.

సొమ్ము స్వాహాపై విచారణ చేయాలి

● పురిటిపెంట ప్రగతి మహిళా సంఘ సభ్యుల డిమాండ్

గజపతినగరం, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ లింకేజీ, సున్నా వడ్డీ, స్త్రీనిధి స్వాహా కావడంపై విచారణ చేయాలని పురిటిపెంట పంచా యతీలో ప్రగతిడ్వాక్రా సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. తాముదాచుకున్న సొమ్మును ఫోర్జరీ సంతకాలతో నొక్కేశారని వాపోయారు. ఈ మేరకు గురువారం వెలుగు కార్యాలయంలో అధికారులను ప్రశ్నించారు. ఫోర్జరీ సంతకాలతో బ్యాంక్ లింకేజీకి సంబంధించి 25 వేలు, సున్నావడ్డీ కింద జమచేసిన 20 వేలు తమకు తెలియకుండా డ్రాచేసినట్లు సంఘసభ్యులు బంకపల్లి సంతోషి లక్ష్మి, కడారిభవానీ, మాదేపల్లి వెంకటరత్నంతోపాటు పలువురు సీసీ దృష్టికి తీసుకువచ్చారు. స్త్రీనిధిలో తీసుకున్న రుణా లకు సంబంధించి 15వేలు బ్యాంక్‌కు చెల్లించలేదని వాపోయారు.రుణాలు లంచంఇవ్వనిదే మంజూరు కావడం లేదని తెలిపారు. సంఘానికి సంబంధించిన బుక్‌లు వీవోఏ ఎల్లేశ్వరి వద్ద ఉండడంతో దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. రుణాలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. సంఘ సభ్యులు రికార్డులు కార్యా లయానికి తీసుకు రావాలని సీసీ రామునాయుడు సూచించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సీసీని ప్రశ్నిస్తున్న మహిళలు

జూట్‌మిల్లును తెరిపించండి

నెల్లిమర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూట్‌మిల్లును తక్షణమే తెరిపించాలని వామపక్ష, కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు గురువారం నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు, కాంగ్రెస్ నాయకుడు కనకల పద్మనాభం మాట్లాడుతూ ముడిసరుకు కొరత వల్ల రెండు వారాలు పాటు మిల్లును మూసివేస్తామని నోటీసు ద్వారా తెలియజేసిన యాజమాన్యం నాలుగు నెలలు గడుస్తున్నాతెరవకపోవడం దారుణమని తెలిపారు. అనంతరం డీటీ రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నామాల సూర్యనారాయణ, అప్పలనర్సయ్య పాల్గొన్నారు.


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న విజయశంకరస్వామి

నెల్లిమర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి తెలిపారు. గురువారం రామస్వామి వారి దేవస్థానం కల్యాణ మండపం ఆవరణలో కోలాటబృందాలు, భజన మండలి సభ్యులతో సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 29న తిరుపతిలో జరగనున్న సదస్సు భజన కళాకారులు, కోలాట కళాకారులు హాజరు కావాలని కోరారు. తొలుత వెంకట దత్తానంద స్వామితో కలిసి సీతారాములను దర్శించుకున్నారు. సదస్సు అనంతరం కళాకారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నిర్వాహకులుగా శ్రీనివాసరావు, గొర్లె రమానాయుడు, పతివాడ సత్యనారాయణ నియమితులయ్యారు.

వసతిగృహం నిర్మాణానికి ప్రతిపాదన

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఎం జుగా నిధులతో గుమ్మలక్ష్మీపురంలో విద్యార్థుల వసతిగృహ నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు తహసీల్దార్ శేఖర్, భద్రగిరి గిరిజన సంక్షేమశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ అప్పారావు స్థలాన్ని పరిశీలించారు.పీఎంజగా నిధులతో పీవీటీజీ గిరిజన విద్యార్థులకోసం వసతిగృహాల నిర్మాణానికి ప్రతిపాదన పంపామని తహసీల్దార్ తెలిపారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురంపై సమీక్ష

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: స్వచ్ఛ సుందర పట్టణంగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం స్వచ్ఛ సుందర పార్వతీపురంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.సమావేశంలో ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ సన్యాసిరావు, మున్సిపల్ ఈఈ వంశీకృష్ణ, డీఈ కిరణ్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌రాజు,ఏపీవో శంకర్ పాల్గొన్నారు.

డయేరియా రోగులకు పరామర్శ

గుర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్లలో డయేరియా మరణాలపై బీజేపీ చీపురుపల్లి అసెంబ్లీ కోకన్వీనర్ మన్నెపూరి శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఆయన డయేరియా సెంటర్‌లో రోగులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి మజ్జి రమేష్‌బాబు, గజపతినగరం కన్వీనర్ సరిది దుర్గాప్రసాద్, త్రినాథ్ ఉన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తెలిపారు. గురువారం మండలంలోని పురిటిపెంట, జిన్నాం, మరుపల్లిల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పీవీవీ గోపాలరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువశ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడశ్రీదేవి, ప్రదీప్‌కుమార్, దుర్గాప్రసాద్, కలిగి పండు పాల్గొన్నారు.

●బొండపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో పల్లెల అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస తెలిపారు. గొల్లుపాలెం, కొనిశ గ్రామాల మధ్య తారురోడ్డుకు, మరువాడ, ఎం.కొత్తవలస మధ్య సీసీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, నాయకులు తత్తడి దేవుడు, మహేశ్వరరావు,పల్లి రామునాయుడు, కన్నం నాయుడు, రామునాయుడు, వెన్నెల పూర్ణచంద్రశేఖర్, కోరాడ కృష్ణ, సర్పంచ్‌లు డోకుల పార్వతీ, నంబూరి రాజేష్, కర్రోతు శ్రీనివాసరావు, బుజ్జి, సీరంరెడి రామ్‌కుమార్, గజపతినగరం సీఐ ఏవీ రవణ పాల్గొన్నారు.


గంట్యాడ: టీడీపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

టీడీపీలో చేరిక

గంట్యాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎంపీటీసీ సభ్యురాలు శిరపురపు శ్యామల, వార్డు సభ్యుడు లడుగు దేముడుతోపాటు గ్రామానికి చెందిన గండిమాను లక్ష్మణ, కరక అప్పలనాయుడు, బర్ల దేముడు, బర్ల అప్పారావు, నెక్కల సన్యాసినాయుడు, నెక్కల ప్రతాప్, గుల్లుపల్లి చిన్నంనాయుడు తదితరులు చేరారు. కార్యక్రమంలోని టీడీపీ మండలాధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

●పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. గురువారం పాలకొండ మెయిన్‌రోడ్డులో కోటదుర్గమ్మ ఆలయానికి సమీపంలో అన్న క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు రూ.5కే భోజనం అందించాలన్న లక్ష్యంతో చంద్రబాబు అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రా ష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ నాయకులు పల్లా కొండబాబు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, గంటా సంతోష్‌కుమార్, గండి రామినాయుడు, జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, కోట సంగంనాయుడు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

పట్టణంలోని మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం లో కోటదుర్గమ్మ పట్టణ మహిళా సమైఖ్య పదాధికారులు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు.


అన్నక్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ


క్రీడాకారులను అభినందిస్తున్న రవిశేఖర్

వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులకు అభినందన

నెల్లిమర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండవెలగాడ క్రీడాకారులు హిమాచల్‌ప్రదేశ్‌లోని నగ్రోటా భగవాన్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించడంతో టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవికుమార్ అభినందించారు. ఈ మేరకు క్రీడాకారులు ఎస్.పల్లవి, సీహెచ్.శ్రీలక్ష్మి, వై.చైతన్యకుమారి, కె.దినేష్‌తో పాటు కోచ్ చల్లా రాము రవిశేఖర్‌ను కలిశారు.

పురిటిపెంటలో బంగారమ్మ పండగ

గజపతినగరం అక్టోబరు 17:(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురిటిపెంటలో గురువారం ఘనంగా బంగారమ్మ తల్లి పండగ గ్రామ పెద్దలు నిర్వహించారు. వేకువ జామునుంచే మహిళలు పసుపు,కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు.


పురిటిపెంటలో ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు


నెల్లిమర్ల: కొత్తపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


బొబ్బిలి: స్థానికులతో మాట్లాడుతున్న కమిషనరు లాలం రామలక్ష్మి

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

● వార్డు, గ్రామసందర్శనలో సమస్యలపై ఆరా

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం జిల్లాలో వార్డు, గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో సమస్యలపై ఆరాతీశారు.

●నెల్లిమర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు శరవేగంగా సాగేలా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కూర్మినాయుడు తెలిపారు. మండలంలోని కొత్తపేటలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణరాజు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●బొబ్బిలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కొత్తఎరుకలివీధి, మహారాణిపేటలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేతాజీ మున్సిపల్‌పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీ లిం చారు. స్థానిక ప్రజలు అనేక సమస్యలను నివేదించారు. సమ స్యల న్నిటిపైనా ప్రతి పాదనలుతయారుచేస్తామని కమిషనర్ రామలక్ష్మి హామీ ఇచ్చారు.

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

బెలగాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న పార్వతీపురం మండలంలోని గోపాలపురానికి చెందిన కర్రి రాకేష్ మృతి విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద తల్లిదండ్రులు, బంధువులుఆందోళన చేపట్టారు. దర్యాప్తుచేసి బాధ్యులపై చర్యలు చేపడితేనే మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్తామని కలెక్టరేట్ వద్ద గురువారం ఆందోళన చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.రాకేష్ మృతిలో బాలిక తల్లిదండ్రులు, రూరల్ ఎస్ఐపై అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తు చేసి చర్య తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ హామీతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తరలించడానికి అంగీకరించారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు

విజయనగరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు ఆధ్వర్యంలో అండర్ - 14, అండర్ - 17 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో నిర్వహించిన ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. కోడి రామ్మూర్తి వ్యాయామశాలలో నిర్వహించిన బాల బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో నలుగురిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో 100 మంది హాజరు కాగా 8 మంది బాలికలు, 11 బాలురును ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలకు డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మన్మధరావు, కోచ్‌లు శ్రీనివాస్, శ్రీను, రావాడ సూర్యనారాయణ, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.


బాక్సింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురంటౌన్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని బెలగాం 11 కేవీ, ఐటీడీఏ 11కెవి ఫ్రీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ గోపాలనాయుడు గురువారం తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గుడ్‌షెడ్ రోడ్డు, సౌందర్య రోడ్డు, ఎస్ఎన్‌పీ, రిక్షా పుల్లర్, శనశక్తి, వివేక్, చర్చి, అగ్రహారం వీధిల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం షాపుపై విచారణ

సీతంపేట రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీతంపేట మద్యం షాప్ నెంబరు46పై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు.మద్యం టెండర్లలో భాగంగా ఇటీవల నిర్వహించిన లాటరీలో సీతంపేట మద్యం షాప్(2) కె.అన్నపూర్ణకు దక్కింది.అయితే ఆమె సీతంపేట మండల వాసి కాదని ఆరోపిస్తు మరో మద్యం షాప్‌టెండర్‌దారుడు హెచ్.ప్రసాదరావు కలెక్టర్‌కు ఫిర్యాదు మేరకు విచారణ ఆదేశించారు. అనంతరం మద్యంషాప్ దక్కించుకున్న అన్నపూర్ణ అత్తవారిస్వగ్రామం హడ్డుబంగిలో ఆర్ఐ వెంకటేష్, వీఆర్వో అలివేలు విచారణ చేశారు.

జోన్-3 అధికారులపై చర్యలు తీసుకోండి

పాలకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ద్యోగుల ప్రమోషన్‌లో ఏళ్ల తరబడి ఉన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను తుంగలోకి తొక్కిన రవాణాశాఖ జోన్-3 అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఫోరం స్టేట్ కన్వీనర్ నూతులపాటి భరత్‌భూషణ్, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం స్టేట్ కన్వీనర్ పోతల దుర్గారావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు అంపోలు ప్రతాప్ కోరారు. గురువారం పాలకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ రవాణాశాఖలో ఏవో పోస్టులు ప్రమోషన్ జాబితాలో క్యాచ్ అప్ రూల్ అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు.